క్లుప్తంగా...

బిహార్‌లో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మహాసభలు

ఉస్మానియా యూనివర్సిటీ: బిహార్‌లోని బెగుసరాయ్ నగరంలో ఏఐఎస్‌ఎఫ్ 30వ జాతీయ మహాసభలు ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 1 వరకు జరగనున్నట్లు ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పై చర్చించనున్నట్లు తెలిపారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

● మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: స్వయం ఉపాధి పథకాలతో మహిళలు స్వయం సమృద్ధిని సాధించాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బన్సీలాల్‌పేట్ డి క్లాస్ అంబేడ్కర్ సంఘంలో సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, ఎస్ఆర్డీ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడుతాయన్నారు. ఎస్ఆర్డీ ప్రతినిధి శివరాణిలతో పాటు స్థానిక మహిళలు, నాయకులు అనేక మంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలించింది


ఎమ్మెల్సీ కవితతో ఆనందం పంచుకుంటున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: మహిళా రిజర్వేషన్ బిల్లును లోకసభలో ప్రవేశపెట్టడంపై జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆనందంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఎమ్మెల్సీ కవిత మార్చిలో ఢిల్లీలో చేపట్టిన ధర్నా, సమావేశం తదితర పోరాటం ఫలితమే ఇది అని డిప్యూటీ మేయర్ పేర్కొన్నారు. ప్రధాని మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్ రాజకీయాల్లో నారీ శక్తిని చాటుతామన్నారు.

బీసీ మహిళా కోటాను చేర్చండి

ఉస్మానియా యూనివర్సిటీ: రిజర్వేషన్ల బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. జనాభాలో సగానికి పైగ ఉన్న బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమిస్తుంటే పట్టించుకోని ప్రభుత్వాలు దొరల చాటున దొరసానులను గద్దెనెక్కించేందుకు రాత్రికి రాత్రే మహిళ బిల్లును తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. 33 శాతంలో బీసీ మహిళకు ప్రత్యేక కోటా ఉండాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


లబ్ధిదారురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల వైద్యానికి సంజీవనిలా పనిచేస్తోందని కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. కంటోన్మెంట్‌లోని పికెట్ కు చెందిన రాజేశ్వరి అనే మహిళకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత ఎల్ఓసీ పత్రాన్ని లాస్య నందిత లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింహ్మ ముదిరాజ్, పనస సంతోష్, మురళి యాదవ్, చిన్న, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కొలువుతీరిన గణపయ్య


ఓయూ క్యాంపస్‌లో గణపయ్య కొలువుతీరారు. వినయక చవతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో క్యాంపస్‌లోని 14 హాస్టల్స్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులు పూజలు చేశారు. –ఉస్మానియా యూనివర్సిటీ


వర్షిత్ సరోవర్ అపార్ట్‌మెంట్‌లో కొలువుదీరిన గణనాథుడు


గణేష్ లడ్డూ ప్రసాదాలను అందజేస్తున్న రామ్‌దేవ్ జ్యువెలర్స్ అధినేత విజయ్

శోభాయమానంగా నవరాత్రి వేడుకలు

చిలకలగూడ : చిలకలగూడలోని పలు ప్రాంతాల్లో గణేష్ నవరాత్రి వేడుకలు శోభాయమానంతో సందడిగా నిర్వహిస్తున్నారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో విద్యుత్ దీపాలు, విభిన్న ఆకృతుల్లో తీర్చిదిద్దిన మండపాల్లో కొలువుదీరిన గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆకీషా ఫౌండేషన్ ఛైర్మన్, బీజేపీ నాయకుడు బండపల్లి సతీష్ ఆధ్వర్యంలో చిలకలగూడ మున్సిపల్ మైదానంలో భారీ మండపాన్ని ఏర్పాటు చేసి లంబోదరున్ని ప్రతిష్టించారు. నవరాత్రులు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, భక్తుల కోరిక మేరకు ఈమారు లడ్డు వేలం వేయనున్నట్లు తెలిపారు. చిలకలగూడ ఠాణా పరిధిలో 330 గణనాథుని మండపాలకు అనుమతి ఇచ్చినట్లు సీఐ మట్టంరాజు తెలిపారు. మండపాల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని నిర్వాహకులను సూచించారు. సుమారు 300 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామన్నారు.

సనత్‌నగర్: పార్వతీ తనయుడు బొజ్జ గణపయ్యకు ఘన స్వాగతం పలికారు. వాడవాడలా మండపాల్లో ప్రతిష్టించి ప్రథమ పూజాదీశుడికి ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ కాలనీల అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్లు, గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కళ్లు జిగేల్‌మనిపించేలా వినాయక మండపాలను తీర్చిదిద్దారు. సనత్‌నగర్ బీకేగూడ 60 ఫీట్ల రోడ్డులోని రామ్‌దేవ్ జ్యువెలర్స్ అధినేత విజయ్ ఆధ్వర్యంలో గణేష్ మండపాలకు 300 కిలోల లడ్డూ ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేయడం గమనార్హం.

బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో సోమవారం గణేష్ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వీధులు, కాలనీలు, బస్తీలు, అపార్టుమెంట్స్‌లో పెద్ద ఎత్తున గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. పలు మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు భక్తిభావంతో పూజా కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మోండా మార్కెట్, టకారబస్తీ, బండిమేట్, ఓల్డ్‌బోయిగూడ, పాన్ బజార్ ప్రాంతాల్లో భారీ గణేష్ మండపాల్లో వినాయక ప్రతిమలను చేశారు.


పద్మారావునగర్ సరస్వతీ రెసిడెన్సీలో వినాయక నవరాత్రోత్సవాలు


టీఎస్‌పీసీబీ కార్యాలయంలో..


సనత్‌నగర్‌లో సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్‌బీ నరేష్


గణనాథుడి పూజలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్

వివిధ రూపాల్లో వినాయకుడు


తార్నాక గోఖుల్‌నగర్‌లో గణనాథుని పూజలో పాల్గొన్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి

లాలాపేట: వినాయక చవితి వేడుకలను తార్నాక డివిజన్ వ్యాప్తంగా ప్రజలందరూ ఘనంగా జరుపుకున్నారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో వాడవాడలా వినాయక మండపాలు వెలిసాయి. వివిధ రూపాలలో కొలువైన వినాయకులను ప్రతిష్టించారు. వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు, భక్తి గీతాలతో కాలనీల్లో, బస్తీల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తార్నాక సండేమార్కెట్‌లో గోఖుల్‌నగర్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువైన భారీ గణనాథున్ని మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బీజేపీ నేత బండ చంద్రారెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గత 24 సంవత్సరాల నుంచి ప్రతి ఏటా గణనాథునికి మొదటి పూజలు చేస్తున్నట్లు కార్తీకరెడ్డి తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

బౌద్ధనగర్: ఎస్సీ వర్గీకరణకు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు తీసుకురాకపోతే కేంద్రం మీద యుద్ధమే చేస్తామని ఎంఎస్పీ జాతీయ నాయకులు మంథని సామ్యూల్ అన్నారు పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ పార్శిగుట్ట చౌరస్తాలో ఎంఎస్పీ సికింద్రాబాద్ కోఆర్డినేటర్ డప్పు మల్లికార్జున్ నేతృత్వంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ్యూల్ మాట్లాడుతూ.. పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ, 30 ఏండ్లుగా ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం సంపూర్ణ మెజారిటీతో కేంద్రంలో అధికారంలో ఉండి కూడా ఎందుకు బిల్లు పెట్టడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో నాయకులు సుక్క పూల శేఖర్, మహేష్, యాదగిరి, నర్సింగ్ రావు, డప్పు మహేష్, తుమ్మల రాజీ, థింక్, మహమ్మద్, సురేష్, కమల్ హాసన్ తదితరులు పాల్గొన్నారు.


పార్శిగుట్ట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ మేయర్


నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, కార్పోరేటర్ సామల హేమ

చిలకలగూడ : చిలకలగూడ మున్సిపల్ మైదానంలో చేపట్టిన నిమజ్జన ఏర్పాట్లను సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, సంబంధిత అధికారులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఐదు అడుగుల ఎత్తుగల వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక ప్లాస్టిక్ వాటర్ పాండ్, ఆరు నుంచి పది అడుగుల ఎత్తున్న విగ్రహాల కోసం ప్రక్కనే మరో తాత్కాలిక పాండ్‌కు ఏర్పాటు చేశారు. ఇళ్లు, చిన్నగల్లీల్లో ప్రతిష్టించిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో పలు ప్రాంతాల్లో తాత్కాలిక చెరువులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిమజ్జన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ సంతృప్తి వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి డివిజన్‌లో నిమజ్జనానికి తగిన ముందస్తు ఏర్పాట్లు చేపట్టామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మాధవి, శానిటేషన్ సూపర్‌వైజర్ ధనగౌడ్, చిలకలగూడ డీఐ శ్రీశైలం నాయక్‌లతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

రసూల్‌పురాలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం షురూ

రసూల్‌పురా: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మహిళలకు ప్రతి నెల 2500 , గ్యాస్ సిలిండర్ ఐదు వందల రూపాయలకు, ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ఆ పార్టీ నాయకులు ప్రజలకు హామీచ్చారు. కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి టిక్కెట్ ఆశిస్తున్న నేతలు అందరు సమిష్టిగా నియోజకవర్గం రసూల్‌పురాలో మంగళవారం ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ హామీలను వివరిస్తూ కరపత్రాలను పంపిణి చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కే. నరసింహన్, జీవకన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, పిడమర్తి రవి, డిబి. దేవేందర్, పాల్గొన్నారు.


ఆరు హామీల గ్యారెంటి కరపత్రం కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే


డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఆత్మీయ సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: పేదలపై ఒక్క పైసా కూడా భారం లేకుండా వారి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్దిదారులతో మంగళవారం ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఇప్పటివరకు పేదలుక అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం అన్నారు. పార్టీలకతీతంగా ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా లబ్దిదారులను ఎంపిక చేసి ఇళ్లను కేటాయిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గం ఆదర్శం

సనత్‌నగర్: అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకువెళ్ళేవిధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కోట్లాది రూపాయల ఖర్చుతో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న అనేక ప్రజా సమస్యలను పరిష్కరించిన విషయాన్ని వివరించారు. నియోజకవర్గ పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నూతనంగా రూ.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రూ.10 కోట్ల వ్యయంతో ఈఎస్ఐ వైకుంఠధామం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ వైకుంఠధామం రాష్ట్రంలోనే మోడల్‌గా నిలవనున్నదన్నారు. తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మహేశ్వరి పాల్గొన్నారు.

తెలంగాణలో కుటుంబ, అవినీతి, అరాచక పాలన

కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో అవినీతి, అరాచకంతో పాటు కుటుంబ పాలన కొనసాగుతోందని..ఈ అసమర్థత పాలనలను అంతమొందించడానికి ప్రజలు కాంగ్రెస్‌ను ఆక్కున చేర్చుకొని ఆదరించాలని సీడబ్ల్యూసీ సభ్యురాలు, పార్లమెంట్ మాజీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల గడపగడకు ప్రచార కార్యక్రమాన్ని సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రజల పోరాటాలు, ఉద్యమాలు, ఆత్మబలిదానాల వల్ల సిద్ధించిన రాష్ట్రం కుటుంబ చేతిలో బందీ అయ్యిందని ఆరోపించారు. దళితున్ని సీఎం చేస్తానన్న సీఎం కేసీఆర్ తానే సీఎం కుర్చీలో కుర్చోని ఒకే కుటుంబంలో ముగ్గురు మంత్రులు అయ్యారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుంటున్నదని మండి పడ్డారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశావాహులు డాక్టర్ కోట నీలిమ, డాక్టర్ రవీందర్ గౌడ్, మర్రి ఆదిత్య, నాగేందర్ రాజ్, విజయవర్ధన్ నాయుడులతో పాటు సనత్‌నగర్ పార్టీ సమన్వయకర్త విజయ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకురాలు ప్రేమ తదితరులు మాట్లాడుతూ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగుర వేయడానికి ప్రజలు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీడబ్ల్యూసీ సభ్యురాలు మీనాక్షి నటరాజన్, అనిల్‌కుమార్ యాదవ్

ప్రేమతత్వంతో అన్నీ శుభాలే

కంటోన్మెంట్: సాటి మనుషులతో పాటు జీవకోటి పట్ల ప్రేమ, అప్యాయత కలిగి ఉన్నప్పుడే సమాజంలో శాంతి, సౌభాగ్యం విలసిల్లుతాయని సాధ్వి డాక్టర్ మంగల్ ప్రగ్యా అన్నారు. 'శ్వేతాంబర్ జైన్ తేరా పంతీ సభ' ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రాజరాజేశ్వరి గార్డెన్స్ ఆవరణలో తొమ్మిది రోజుల 'ప్రయూషన్ మహా పర్వ్' కొనసాగుతోంది. ఎనిమిదో రోజైన మంగళవారం కీలకమైన ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధ్వి ప్రగ్యా, శిష్య బృందం ఆధ్యాత్మిక బోధనలు, గీతాలాపనల్లో వేలాది మంది జైన్‌లు పాల్గొన్నారు. కార్యక్రమలో సభ ప్రతినిధులు బాబూలాల్, బైద్, సుక్ సంచేతీ, ముఖేశ్ చోరాడియా, లక్ష్మీపతి బైద్, లలిత్ ఖైద్, నవీన్ ఛాజెడ్, హిమాన్షూ బాప్నా తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ హామీలను గడప గడపకూ చేరవేస్తాం


ఇంటింటికీ ఆరు గ్యారెంటీ హామీల కార్యక్రమంలో మర్రి ఆదిత్యరెడ్డి

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఆరు గ్యారంటీ హామీలను సనత్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి గడపకూ చేరవేస్తామని టీపీసీసీ సభ్యులు, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు మర్రి ఆదిత్యరెడ్డి అన్నారు. గడప గడపకూ గ్యారెంటీ కార్డుల కార్యక్రమాన్ని సోమవారం నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్, డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్ళి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను వివరించారు. అధికారంలోకి వచ్చాక ప్రతి హామీనీ అమలుచేస్తామని, సామాజిక తెలంగాణ సాకారానికి బాటలు వేస్తామన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియమ్మ రుణం తీర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విఠల్, డాక్టర్ శివకుమార్‌లాల్, శైలేష్‌గౌడ్, కృష్ణయాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరంగల్ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి



ఉస్మానియా యూనివర్సిటీ: గతంలో వరంగల్‌లో చేసిన వాగ్దానాన్ని, ప్రగతి భవన్‌లో ఇచ్చిన ఉద్యోగాల పర్మనెంట్ హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకోవాలని కాంట్రాక్టు అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల పర్మనెంట్ కోసం చాక్‌డౌన్, పెన్‌డౌన్ ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఓయూ ఆర్ట్స్ కాలేజీ బస్టాప్ వద్ద కొనసాగుతున్న ధర్నా మంగళవారానికి 14వ రోజుకు చేరుకుంది. సందర్భంగా జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ సిమర్ల విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పర్మనెంట్ కోసం 12 వర్సిటీలలో అధ్యాపకులు విధులు బహిష్కరించి ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు.కార్యక్రమంలో పళ్ళ రేష్మారెడ్డి, వెంకటేష్, రమేష్, కృష్ణయ్య, సనత్, మల్లేష్, స్రవంతిరెడ్డి, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను ఉపయోగించుకోవాలి


హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన డెంటల్ విభాగాన్ని పరిశీలిస్తున్న డీసీహెచ్ సునీత

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (మెటర్నిటీ సెంటర్)ను మంగళవారం డిస్ట్రిక్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసిహెచ్) డాక్టర్ సునీత పర్యవేక్షించారు. మెటర్నిటీ హాస్పిటల్‌లో లేబర్ రూం, డెంటల్ వార్డు, ఇన్‌పేషంట్ వార్డులను పరిశీలించారు. వైద్యుల కొరత, వైద్య పరికరాలు, సదుపాయాలపై హాస్పిటల్ సూపరెండెంట్ డాక్టర్ పల్లవితో చర్చించారు. ఇటీవల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన డెంటల్ ఓపి విభాగం సేవలను స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనీ సూచించారు.

హెల్త్ మేళా నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష

కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న లాలాపేట కమ్యునిటీ ఆరోగ్య కేంద్రంలో హెల్త్ మేళాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సునీత తెలిపారు. దీని నిర్వాహణ కోసం హాస్పిటల్ అధికారులతో సమీక్ష చేశారు.